# కథ


చచ్చు బడిపోయిన కుడి కాలు, ముడ్డి మీద చిరిగిపోయిన నిక్కరు, బొత్తాములు పెట్టని అలుగుడ్డ లాంటి షర్టు, నడిచేందుకు సహాయంగా ఓ కర్ర, ఇది ఆ ఎనిమిదేళ్ళ ముష్టి గుంటడి రూపం. వాడికి తోడుగా పదేళ్ళ కుర్రాడు, రెండు కాళ్ళు సమంగానే వున్న వాడు గుడ్డల విషయంలో తమ్ముడిని మించిన నీట్‌నెస్. వాడు వాడికి అన్నని ఎలా చెప్పానా? ముఖాలు చూసి చెప్పరేంటండీ! తల్లిని పోలి వుంటారు, వెధవాయ్‌లు—

హుస్సేన్‌గారి దెబ్బతో మా అలమండ నుంచి కొత్తవలసకి బస్సు చార్జి రూపాయ్ డెబ్బై అయిదు పైసలయ్యింది. రెండు నోటిస్తే పావలా చిల్లర వుంటే యిస్తాడు. లేకపోతే లేదు, కండక్టరుకెందుకు దొబ్బ బెట్టడం అని, పిల్లాళ్ళని చూసి జాలేసి, నోటు మార్చి పావలా కాసు పొట్టివాడి చేతిలో విదానంగా పడేసాను.

విజయనగరం వెళ్ళటానికి బస్సులు నాలుగైదు వచ్చాయి, కాని నన్ను మోసేందుకు ఇటు ప్రక్క బస్సు 'ప్రెజెంట్ సార్' అన్లేదు. ఓ వాక్యం తయారు చేశాను ఊసుపోక, "ఒక ప్రక్క బస్సుల తోరణం, మరొక ప్రక్క బస్సులతో రణం" అని. బలే చెప్పారు గురూజీ, ఆర్టీసీ అంటే, రాదు, తెలీదు, చేరదు. బలే బలే చెప్పారు గురూజీ హేట్సాఫ్ అన్నాను, అన్నానా? లేదు, లేదు, అనుకున్నాను. ఓ అరగంటో, ఇంకా ఎక్కువో గడిచాక వచ్చింది బస్సు. అదెక్కి కొత్తవలస వెళితే మ్యాట్నీ షైవ్‌కి అరగంట ముందు థియేటర్ ఎదుట వాలగలం అన్న ధీమా వుంది గనక బస్సునీ, బస్సు డ్రైవర్నీ వగైరాలందర్నీ తిట్టకుండా బస్సెక్కేశాను.

సీటు దొరికింది, కూర్చున్నాను. ఓ అమ్మాయి సైట్ లాగుతోంది. ఆ అమ్మాయ్ లాగుతోందా? నేనా? నేనేనేమో, కాదు. ఆ అమ్మాయే! అమ్మాయా? నేనా? పోనీ యిద్దరం వొకరి కొకరం అనుకుని కూర్చున్నాను స్థిరంగా. వెనక్కి చూశాను ఎందుకో, అసంకల్పిత ప్రతీకార చర్య. 'పొగ త్రాగరాదు' అని వుంది. నేను తాగటం లేదే నా కెందుకు చెప్తున్నాదీ బస్సు? నా కేంటి? ఎవరటు చూస్తే వాళ్ళందరికీ చెప్తుంది. అయినా ఆర్టీసీ వాళ్ల బుర్ర తక్కువ గాని, ఎదురుగుండా వ్రాస్తే అందరూ చూస్తారు. వెనక తగలడడం ఏంటి? ఓహో ఎక్కేటప్పుడు చూస్తారేమో అనా? ఎక్కేటప్పుడు అక్షరాల్ని ఎవడు చూస్తాడు? అందాల్ని వెతుకుతాడు, ఇంకా ముందు సీటు వెతుక్కుంటాడు. బస్సు సీటే నండోయ్! మీరు అపార్థం చేసుకుంటే నేను బాధ్యుణ్ణి కాను. నేను కూర్చున్న సీటు ముందు, సీటుపై "రిజర్వుడు ఫర్ ఎంపీస్, ఎమ్మెల్యేస్" అని వుంది. అయినా ఈ ఆర్టీసీకి బుర్ర తక్కువ గాని, ఎంపీలకి, ఎమ్మెల్యేలకి బస్సెక్కే ఖర్మేం పట్టిందండి? సిట్లో కూర్చున్న బుర్ర మీసాలు, కుండ బొజ్జ గాణ్ణి ఎంపీగా, అక్కుపక్షి పెర్సనాలిటీని ఎమ్మెల్యేగా చూడక తప్పింది కాదు.

పైటమ్మాయి అదె ఆ పైటమ్మాయి. సుంకర పాలెంలో దిగిపోయింది. ఆమె వైపే చూశాను చూస్తుందేమో అని. నేనే లాగాను, ఆ పతివ్రత' లాగ లేదన్న మాట' అనుకుంటున్నాను, చూసింది. చిన్న నవ్వు కూడాను. పండు బాగుంది. పాప బస్సు దిగేస్తే? 'ఆ దిగీ, హనుమంతుడు పండుని చూసి మూతి కాల్చుకున్నాడు నువ్వు, మూతి విరగ్గొట్టించుకుందువు గానీ దిగీ బాబూ దిగీ' అన్నాడు ఆత్మారాముడు. భయమేసి దిగ లేదు. అయినా మల్లీశ్వరో!




కుర్ర వెధవకి పావలా యిచ్చాను, వాళ్ళు దాన్ని కాళ్లేని వాడికి పది హేను పైసలు గానూ కాలున్న వాడు పది పైసలు గానూ పంచుకుంటారేమో! అలాగయితే ముష్టి యుగంలో ధర్మం నాలుగు పాదాలా నడిచినట్లే! వాళ్ళెలా పోతే నీకేమోయ్, అని చలంగారు నా వైపు చూసి నవ్వుతున్నారు. వెండి గడ్డం తడమాలనిపించింది. "మైదానం"- ఏం రాసావ్ గురూ! అన్నట్లు గురూ, యివాళ మై "దానం" పొట్టోడికి పావలా. ఎలా కొట్టేం దెబ్బ! బాగులేదేమో చలం గారు కనబడలేదు. మధ్యలో ముడిచియ్యాలని పించింది అంటే, కుర్రకుంకకి అర్థమవ్వలేదన్న మాట! "ఒరి నాయుడా! "మైదానమే" ఎక్కకపోతే ఏం చదువుతావురా" అనుకున్నాను.

కొత్తవలసలో దిగి చార్మినార్ సిగరెట్ ముట్టించాను. ముందు ఫిల్టర్ సిగరెట్లు మాత్రమే కాల్చే వాడిని, ఎటు ప్రక్క అంటించాలో తెలీక ఎటు అంటించినా పొగొస్తుందని తెలిసి, చార్మినార్ శిఖరాలెక్కేసాను. బాల్కనీ కొన్నాను. మల్లీశ్వరి పూర్తయింది." బస్సుందా? లేదు! బస్సుందా? లేదు! ప్రైవేట్ బస్సేస్తాం! పళ్ళు రాలగొడతాం. బస్సుందా? లేదు!" బాగానే కూర్చావే! ఏం నాకు రాదేంటి? నవీనంప శయ్యలో స్వ.కు.మ. గుర్తొచ్చి, ఆ "మ" మానేశాను.

హోటల్ కెళ్ళి టిఫిన్ తిందాం. ఏం టిఫిన్‌లే చపాతి యివాళ చేస్తే, కూర నిన్నటిదిస్తాడు. ఒక వేళ కర్రీయే వేడిగా వుంటే చపాతి మొన్నటిదిస్తాడు. వెధవ టిఫిన్. కాఫీ త్రాగుదాం, అనుకుని వెళ్ళాను. గులాబ్‌జాం చూసే సరికి జిహ్వా చాపల్యం, ఆర్డరిచ్చాను. అలా ఏవేవో మింగి, కాఫీ గొంతుకలో పోసుకుని ఆకు పచ్చనోటు అర్పించాను. కూరలు పోగులు పోగులుగా కనబడ్డాయి. కొంటే? అబ్బ యిప్పట్నుంచి సంసారం, తాపత్రయం మనకెందుకులే? మరి కంచం దగ్గర కూర్చుని గావు కేకలు పెట్టి అమ్మ మీద ఎగిరాను నిన్న రాత్రి. కంది గుండ, ఇంగువ చారు తినలేక నిన్నేదో ఎగిరాను గానీ కంది గుండకేం, అసలు ఇంగువ చారు రుచి ఎవడికి తెలుసు? అయినా సంచీ లేదు, ఏమీ లేదు. జేబులో పెట్టి పట్టికెళ్తామా? అమ్మో అలా అయితే ఇంకేమైనా వుందా? "జై కందిగుండ" అనేసి కూరల వైపు మరి చూడలేదు.

ఆ పత్రిక కొనటమా, ఈ పత్రిక కొనటమా? అదా, ఇదా? ఏదో ఒకటి నిర్ణయించుకోరా బాబూ! బస్సు బయల్దేరుతోంది. తోరణం కాదు రణం. అసలు పుస్తకమెందుకు? రేపాదివారం బోర్ కొట్టదూ? పాతవి తిరగేద్దాంలే! పుస్తకం కొనకుండా బస్సెక్కేశాను.

బస్సులో వుండగా సుంకరపాలెం వచ్చింది. మరి రాదూ! వెధవ తెలివి! మళ్ళీ ఆ అమ్మాయి గుర్తొచ్చింది. అవును, ఆ అమ్మాయి ఎందుకు నా వైపే చూసింది? ఏం నాకేం తక్కువ? నా "ఫోటోసన్ గ్లాసెస్" "పాంటులో దోపిన షర్టు"! నాకేం తక్కువ? నవీన్ మళ్ళా గుర్తొచ్చాడు. కుడి చేత్తో నన్ను నేనే జెల్ల కొట్టుకున్నాను.

మా అలమండ వచ్చేసిందండీ, దిగాను. బడ్డీ కొట్టుకి నడిచేను రైలింజన్ స్టార్ట్ చేద్దాం అని. ఇంకేముంది? ఆశ్చర్య సముద్రంలో నేను! వెర్రి వెంగళప్ప మొహం వేసుకుని నేను! ఓడిపోయినట్టు ఫీలింగిచ్చి నేను! తప్పు చేశానా అని సతమతమవుతున్న నేను, చార్మినార్ అడగలేక పోయాను. ఫిల్టర్ సిగరెట్లు చెరొకటి పట్టుకుని దమ్ములాగి, నా వైపు చూస్తున్న పొట్టి ముష్టి వాణ్ణీ, వాళ్ళన్నయ్యనీ చూసి.

"తిండానికి తిండి లేదు, కట్టడానికి గుడ్డ లేదు. మీ ముష్టి బ్రతుకులకి సిగరెట్లెందుకురా అని వాళ్ళని తిడితే" అనుకున్నాను. 'అంత కన్న బుద్ధి తక్కువ పని యింకొకటి లేదు పద పద' అన్నాడు ఆత్మారాముడు. —వియ్యెస్సార్ కాండూరి